జ్వాల

# దశ

నిజం.. నిర్భయంగా..

WWW.
DASHANEWS
.COM

బుధవారం
03 12 2025

సంపుటి 1 సంచిక 13

పేజీలు : 04

RNI :
TGTEL/25/A4195



## విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)




### హయత్ నగర్ ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన

బస్సు ప్రమాదంలో చెయ్యి కోల్పోయిన బాధితుడి కుటుంబ సభ్యుల ఆందోళన 2



### గాంధీభవన్ లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం

టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. 2



### కేసులు పెడితే భయపడేది లేదు: సీఎం రేవంత్ రెడ్డి

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 2




# గ్రామాల్లో మారుతున్న లెక్కలు


**హాట్ హాట్ గా మండల వ్యాప్త రాజకీయాలు. గ్రామాల్లో ఏ కోణంలో చూసిన ఎన్నికల జోరు...**

**దశ, హైదరాబాద్:**

గ్రామపంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే మండలవ్యాప్తంగా రాజకీయాలు హాట్ హాట్ గా మారాయి. మండలంలో రెండో విడతలో ఎన్నికలు జరగనున్నాయి. అయితే సర్పంచ్, వార్డ్ సభ్యులుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహులు ఇప్పటికే రంగంలోకి దూకేశారు. గ్రామాలలో ఏ కోణంలో చూసిన రాజకీయ సమావేశాలు, చర్చలు, లెక్కలు, పంచాయతీ ఎన్నికల జోరు స్పష్టంగా కనిపిస్తున్నది.రాబోయే ఎన్నికల్లో అధికార పార్టీ సపోర్టు దక్కించుకోవడం గెలుపునకు కీలకమని భావిస్తున్న ఆశావహులు బడా నాయకుల తలుపులు తడుతున్నారు. ఒక్కో పార్టీలో ఐదునుంచి ఆరుమంది. పోటీ పడుతుండడంతో స్థానిక నాయకులు సుక్క ముక్క ఏర్పాటు చేస్తూ అనుచరులను కాపాడుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. ఎవరికి టికెట్ ఇవ్వాలి? ఎలా ఇవ్వాలనే సందిగ్ధంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఇద్దరూ పార్టీ క్యాడర్ దెబ్బతినకుండా మిగతా 2వ పేజీలో

## ఔటర్ రింగు రోడ్డు వరకు

# సిటీనే..



**మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసేందుకు మంత్రివర్గం ఆమోదం**

**నిర్ణ యం వినడానికి బాగానే ఉన్నా.. ఆచరణ లో మాత్రం అడుగడుగునా సవాళ్లు.**

**విస్తరణ తర్వాత 2 కోట్లకు పెరగనున్నా జనాభా .**

**పన్నులు పెంచబోమని చెబుతున్నప్పటికీ.. ఏకీకృత పాలన వచ్చాక పన్నుల ఏకీకరణ తప్పనిసరి**

"హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిని విస్తరించి, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నవంబర్ 25న జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలోనూ ఈ అంశాన్ని టేబుల్ ఎజెండాగా పెట్టి ఆమోదించారు. అయితే, కాగితంపై ఈ నిర్ణయం ఎంత అద్భుతంగా కనిపిస్తుందో..

**దశ, హైదరాబాద్:**

ఆచరణలో దీని వెనుక అంతటి కఠినమైన సవాళ్లు ఉన్నాయన్నది పాలనా నిపుణుల మాట. అసలు ప్రభుత్వం ఎందుకు ఈ నిర్ణయం తీసుకుంది.. దీని వల్ల సామాన్యుడికి ఒరిగేదేంటి..? క్షేత్రస్థాయిలో ఎదురయ్యే చిక్కుముడులేంటి..? జీహెచ్ఎంసీని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యం వినడానికి బాగానే ఉన్నా.. ఆచరణ లో మాత్రం అడుగడుగునా సవాళ్లు ఎదురుకానున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం కోటికి పైగా జనాభా ఉంది. విస్తరణ తర్వాత 2 కోట్లకు పెరగనుంది.అంటే రాష్ట్ర మొత్తం జనాభాలో మిగతా 3వ పేజీలో




## ఊరి బయటే వైన్ షాపులు

- మునుగోడు నియోజకవర్గం లో ఒంటి గంటకే షాపులు ఓపెన్
- సాయంత్రం 6 గంటలకు పర్మిట్ రూంలోకి అనుమతి
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనల ప్రకారమే అంతా..


**దశ, మునుగోడు**

మునుగోడు నియోజకవర్గం లో వైన్ షాపుల నిర్వహణ విషయంలో శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచనల ప్రకారమే మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు ఊరి బయటే వైన్ షాపులను ఓపెన్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే విక్రయాలు మొదలు పెట్టారు.. సాయంత్రం 6 గంటలకు పర్మిట్ రూంలోకి అనుమతిస్తున్నారు.. మద్యం షాపులకు కొత్తగా టెండర్లు వేసే సందర్భంలోనే మునుగోడు మిగతా 2 లో

## దేశానికే తలమానికం

# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

- యూనివర్సిటీ పూర్తిస్థాయి నిర్మాణానికి నిధులు ఇస్తా
- విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత
- ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి పూర్తి సహకారం
- యూనివర్సిటీ ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి



**దశ, భద్రాద్రి కొత్తగూడెం, మహా:**

ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అంటే తనకు ఎంతో అభిమానం అని ఆ జిల్లా అభివృద్ధికి తాను శక్తివంచలు లేకుండా కృషి చేస్తానని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నవభారత్ పరిధిలోని ఉన్న కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో కొత్తగా ఏర్పాటు అయిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మిగతా 3వ పేజీలో

## 'మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్'కు గవర్నర్ ఆమోదం

**దశ, హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో 'మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్'కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీల వి లీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు మున్సిపల్, అర్బన్ డవలప్ మెంట్ శాఖ కసరత్తు పూర్తి చేసింది. జీహెచ్ఎంసీలో 7 ము న్సిపల్ కార్పొరేషన్లు, 20మున్సిపాలిటీలను వి లీనం చేయాలని ఈ నెల 25న జరిగిన మం త్రివర్గ సమావేశంలో ఆమోదించిన విషయం తెలిసిందే. దీంతోపాటు విలీనం మిగతా 2వ పేజీలో



## మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి తీవ్ర గాయలు

**దశ, హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ శివగంగ కాలనీలో ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. 10 నుంచి 15 వరకు కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి మెడ, చెవి, నడుము, పిక్కలను కొరకడంతోపాటు చెవి ఊడిపోయి.. బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు మేస్త్రి పనులు చేసుకుంటూ శివగంగ కాలనీలో మూడేండ్లుగా ఉంటున్నారు. వీరి కొడుకు ప్రేమ్ చంద్ పుట్టుకతోనే మూగవాడు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా తల్లి ఇంట్లో తాగునీరు పడుతోంది. ఆ సమయంలో ఇంట్లో నుంచి ఆడుకుంటూ బయటకు వచ్చిన ప్రేమ్ చంద్ పై వీధి కుక్కలు దాడి చేశాయగా, స్థానికులు గమనించి కుక్కల్ని తరిమేశారు. గాయపడిన బాలుడిని నిలోఫర్ చిల్డ్రన్స్ ఆస్పత్రికి తరలించారు.



## తెలంగాణ ఫిఫా.. మరో రెండు

# ఫుట్‌బాల్ అకాడమీలు

**దశ, హైదరాబాద్ :**

భారత ఫుట్‌బాల్ చరిత్రలో ఓ సరికొత్త అధ్యాయం మొదలు కానుంది. దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీపై మరో కీలక అడుగు ముందుకు పడనుంది. దీనికి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదిక కానుంది. ఈ నెల 8, 9న భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న సదస్సులో.. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు సంబంధించిన ప్రధాన భాగస్వామ్యాలను ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడాకారుల అభివృద్ధికి వీలుగా రెండు కొత్త FIFAAIFF ఫుట్‌బాల్ అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించనుంది. ఈ అకాడమీలు



ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్, అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మహిళా మిగతా 3 లో



### క్షేత్రపాలకుడు ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

2వ పేజీలో



# ఉసిరితో చలికాలం సమస్యలకు చెక్

**దశ, సిటీబ్యూరో:** చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలకు ఉసిరికాయ అద్భుత పరిష్కారం. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరి, రోగనిరోధక శక్తిని పెంచి, ఫ్రీ రాడికల్స్ పోరాడుతుంది.అధిక పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. మెటబాలిజం పెంచి బరువు నియంత్రణలో సహాయపడుతుంది. చర్మం, జుట్టు ఆరోగ్యానికి, డయాబెటిస్ నియంత్రణకు కూడా ఉసిరి మేలు చేస్తుంది.రోజుకు ఒక్క ఉసిరిని పచ్చిగా, జ్యూస్గా పచ్చడి రూపంలో తీసుకోవడం ద్వారా చలికాలంలో ఆరోగ్యంగా ఉండవచ్చు.





# హయత్ నగర్ ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన

### బస్సు ప్రమాదంలో చెయ్యి కొల్పోయిన బాధితుడి కుటుంబ సభ్యుల ఆందోళన

**దశ, ఎల్బీనగర్ :** ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో చెయ్యి కొల్పోయిన బాధితుడికి పరిహారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం హయత్ నగర్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే... గత 27వ తేదీన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పిస్తా హౌస్ వద్ద సర్వీస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటన చోటు చేసుకుంది.. ఈ ప్రమాదంలో హయత్ నగర్ డివిజన్ కు చెందిన సాయికృష్ణ కుడి చెయ్యిని పోగొట్టుకున్నాడు. సాయికృష్ణ(19) న్యాయం చేయాలని, తగిన పరిహారం చెల్లించాలని బాధితుడి బంధువులు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే కుడిచేయి తీయాల్సి వచ్చిందని తెలిపారు. డిపో మేనేజర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# క్షేత్రపాలకుడు ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

**దశ యాదగిరిగుట్ట:** ప్రసిద్ధ యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం లో మంగళవారంశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధి విష్ణు పుష్కరిణి ఆవరణలో గల ఆంజనేయ స్వామికి అర్చక బృందం ఆధ్వర్యంలో మన్య సూక్త పారాయణముతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించి స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఈ ఆకు పూజలో భక్తులు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఊరి బయటే వైన్ షాపులు

**మొదటి పేజీ తరువాయి**

నియోజకవర్గ వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునే యజమానులకు బెల్ట్ షాపులు నిర్వహించొద్దని సిండికేట్ అవ్వకూడదని, ఊరి బయటే మద్యం విక్రయాలు జరపాలని, పర్మిట్ రూంలకు అనుమతించొద్దని పలు సూచనలు చేశారు రాజ్ గోపాల్ రెడ్డి. వీలైతే స్థానికంగా ఉన్న వ్యక్తులే మద్యం టెండర్లు వేసి దక్కించుకునేలా ప్రోత్సహించారు.. మద్యం టెండర్ల డ్రాలో కొన్ని మద్యం షాపులు స్థానికులు మరికొన్ని స్థానికేతరులు దక్కించుకున్నారు.. మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులతో హైదరాబాదులోని తన నివాసంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో మద్యం షాపులను మధ్యాహ్నం 1:00 తర్వాత తెరవాలని, 6 గంటల నుండి పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వాలని, బెల్ట్ షాపులకు మద్యం విక్రయించొద్దని సూచించారు.



రాజగోపాల్ రెడ్డి గారు సూచించిన అంశాలకు లోబడి మద్యం షాపులు నిర్వహిస్థామని మాట ఇచ్చారు మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు.. ఈరోజు నుండి నియోజకవర్గ వ్యాప్తంగా కొత్త మద్యం షాపులు ఓపెన్ అయ్యాయి.. మునుగోడు నియోజకవర్గం లోని మండలాలలో ఊరి బయటే మద్యం దుకాణాలను ప్రారంభించి మధ్యాహ్నం 1:00 గంటల నుండి విక్రయాలు ప్రారంభించారు.

# 'మున్సిపాలిటీల విలీన ఆర్డినెన్స్'కు గవర్నర్ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

అంశాన్ని ఈ నెల 25న జరిగిన జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలో ఆమోదించారు. కాగా దీనికి సంబంధించి అసెంబ్లీలో చట్టం చేయడానికి అవకాశం లేకపోవడంతో ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభు త్వం నుంచి గవర్నర్‌కు ఆర్డినెన్స్‌ను పంపించడంతో ఆయన ఆమోదిస్తూ సంతకం చేశారు. ఈ ఫైల్ లోక్ భవన్ నుంచి న్యాయ శాఖకు వ చ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌కు సం బంధించిన గెజిట్ విడుదల చేయనుంది. విలీ న ప్రక్రియలో భాగంగా 27 మున్సిపాలిటీల ఆ స్తులను హ్యాండ్ ఓవర్, వంటి అంశాలను గు ర్తించి గెజిట్‌లో ప్రభుత్వం వివరిస్తుందని అధికార వర్గాల సమాచారం.

## ఓటుకు నోటు ప్రజాస్వామ్యానికి
# పెను ప్రమాదం!



స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. నిజానికి, ఎన్నికలు అంటే అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ, గ్రామ భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికలు. కానీ, నేడు గ్రామాల్లో వినిపిస్తున్న చర్చలు మాత్రం ప్రజాస్వామ్యం మూలాలను కుదిపేస్తున్నాయి: "ఎవరు ఎంత ఇస్తారు? ఎవరు ఎక్కువ డబ్బులు ఖర్చు పెడుతున్నారు?" ఓటును బజారులో వేలానికి పెడుతున్న ఈ ధోరణి మన ప్రజాస్వామ్య వ్యవస్థకు పెను ప్రమాద ఘంటిక.

**తాత్కాలిక ప్రలోభం ఐదేళ్ల నష్టం..**

రూ. 500, రూ. 1000, ఒక మద్యం సీసా, కిలో చికెన్... ఇవి తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే. ఈ చిరు ప్రలోభాలకు మన ఓటును అమ్ముకోవడం కేవలం ఓటును అమ్ముకోవడం కాదు, మన గ్రామాన్ని, మన పిల్లల భవిష్యత్తును, మన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. ఒకరోజు ప్రలోభానికి లొంగితే, రాబోయే ఐదేళ్లూ నష్టపోవడం ఖాయం. డబ్బు తీసుకుని ఓటేసిన తర్వాత, నాయకుడిని నిలదీసే నైతిక బలం ఓటరుకు ఉండదు. ప్రశ్నించే ప్రజలు లేని చోట అవినీతి రాజ్యమేలుతుంది.

**నాయకుడిలో పెరిగే అహంకారం..**

డబ్బు పెట్టి గెలిచిన నాయకుడిలో "డబ్బు ఖర్చుపెట్టి గెలిచా, వీరి మాట వినాలా?" అనే అహంకారం పెరుగుతుంది. పాలన సేవ నుండి పెత్తనానికి మారుతుంది. మొదటగా, ఖర్చు చేసిన డబ్బులు వసూలు చేయడానికే ప్రయత్నిస్తాడు తప్ప, సేవ చేయడానికి కాదు. దీని పర్యవసానమే నాసిరకం పనులు, కమీషన్లు, దందాలు, అభివృద్ధి నిధుల దోపిడీ. ఓటుకు నోటు అనే రాజకీయ కల్చర్ అభివృద్ధిని బలోపేతం చేయదు, బలహీనపరుస్తుంది.

**మార్పు ఓటర్లలోనే మొదలవ్వాలి..**

మీరు వేసే ప్రతి ఓటు మీ గ్రామ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. రోడ్ల నాణ్యత, తాగునీటి సరఫరా, వీధి దీపాల వెలుగులు, పాఠశాలల్లో పిల్లల విద్య, పేదలకు లభించే ప్రభుత్వ సేవలలో పారదర్శకత - ఇవన్నీ మీ ఓటుతోనే సాధ్యపడతాయి.

మార్పు నాయకులలో కాదు, ఓటర్లలో కూడా రావాలి. ఓటర్లు ప్రలోభాలకు లొంగకపోతే, డబ్బు పంచే రాజకీయాలు కూడా ఆగిపోతాయి. ప్రలోభాలకు నో చెప్పండి. ఓటు అమ్మని ఓటరే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షకుడు.

**ప్రమాణాలు పనితీరు, నిజాయితీ, సేవాభావం**

కులం, మతం, పార్టీ కాదు; పనితీరు, నిజాయితీ, సేవాభావమే మన ఎన్నికల ప్రమాణాలు కావాలి. డబ్బు పంచే నాయకులకు కాకుండా, సేవ చేయాలనే హృదయం ఉన్న నిజాయితీగల యువతకు అవకాశం ఇవ్వండి. అదే అవినీతి రహిత రాజకీయాలకు పునాది అవుతుంది.

సామాన్యుడికి ఉన్న అత్యంత శక్తిమంతమైన ఆయుధం ఓటు. ఈ ఆయుధాన్ని అమ్ముకుంటే, ప్రజాస్వామ్యాన్ని, భావితరాల భవిష్యత్తును ఎవరూ రక్షించలేరు."నా ఓటు విలువ నిజంగా అంతేనా? నా ఆత్మ అభిమానాన్ని, మా గ్రామ భవిష్యత్తును నేను డబ్బుకు తాకట్టు పెట్టాలా?" అని ప్రతి ఓటరు ఆత్మ విమర్శన చేసుకోవడం అత్యంత అవసరం. ఓటు అమ్ముకోకండి! ప్రలోభాలకు లొంగకండి! విచక్షణతో ఓటు వేసి, మీ గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకోండి, ప్రజాస్వామ్యాన్ని రక్షించండి.

**-చిర్ర శోభన్ బాబు, కోటమర్తి**
**(ఉస్మానియా యూనివర్సిటీ)**

# కేసులు పెడితే భయపడేది లేదు: సీఎం రేవంత్ రెడ్డి



**దశ, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు.నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి వీరు ఆర్థిక సహాయం అందించారన్నారు. ప్రైవేట్ సంస్థల్లో పని చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఉండవని.. ఈ నేపథ్యంలో ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ సిబ్బందిని మంచి ఆలోచనతో వీరు ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. పత్రికను తిరిగి నడిపించాలనే ఉద్దేశ్యంతో బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంత మంది కాంగ్రెస్ పార్టీ నేతలను తీసుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నిర్ణయించి.. నేషనల్ హెరాల్డ్ పత్రిక పునరుద్దరించే ప్రక్రియను వారు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలో కోసం గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఆయన సోదాహరణంగా వివరించారు.

# గాంధీభ వన్‌లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం

**దశ, హైద్రాబాద్ / యాదగిరిగుట్ట :** టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్ ,సచిన్ సావంత్ ,మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకాటి శ్రీహరి, అజారుద్దీన్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నూతన డీసీసీ అధ్యక్షులు,పూర్వ డీసీసీ అధ్యక్షులు,టీపీసీసీ కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల లో అనుసరించాల్సిన వ్యూహం , గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం, రెండేళ్ల ప్రజా పాలన వారోత్సవాల విజయవంతం తదితర అంశాలపై నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, నూతన డీసీసీ అధ్యక్షులు,పూర్వ డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.


## తెలంగాణ ఫిఫా.. మరో రెండు
# ఫుట్‌బాల్ అకాడమీలు

**మొదటి పేజీ తరువాయి**

అంశాన్ని ఈ నెల 25న జరిగిన జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశంలో ఆమోదించారు. కాగా దీనికి సంబంధించి అసెంబ్లీలో చట్టం చేయడానికి అవకాశం లేకపోవడంతో ఆర్డినెన్స్ తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభు త్వం నుంచి గవర్నర్‌కు ఆర్డినెన్స్‌ను పంపించడంతో ఆయన ఆమోదిస్తూ సంతకం చేశారు. ఈ ఫైల్ లోక్ భవన్ నుంచి న్యాయ శాఖకు వ చ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌కు సం బంధించిన గెజిట్ విడుదల చేయనుంది. విలీ న ప్రక్రియలో భాగంగా 27 మున్సిపాలిటీల ఆ స్తులను హ్యాండ్ ఓవర్, వంటి అంశాలను గు ర్తించి గెజిట్‌లో ప్రభుత్వం వివరిస్తుందని అధికార వర్గాల సమాచారం.ఫుట్‌బాల్ అకాడమీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ చర్యలు తెలంగాణను క్రీడలకు ముఖ్య కేంద్రంగా మార్చడానికి, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిభావంతులను అభివృద్ధి చేయడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఈ అకాడమీలు ఎందుకంటే..?**

రాష్ట్రంలో అట్టడుగు స్థాయి నుంచి ఫుట్‌బాల్



ప్రతిభను గుర్తించి, వారికి మెరుగైన శిక్షణ ఇవ్వడానికి ఈ అకాడమీలు కృషి చేస్తాయి. ఈ అకాడమీల ద్వారా క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ లభిస్తుంది. కాగా ఇదివరకే హైదరాబాద్‌లో బాలికల కోసం భారతదేశపు మొట్టమొదటి FIFA టాలెంట్ అకాడమీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదనంగా రానున్న ఈ రెండు అకాడమీలు రాష్ట్రంలో ఫుట్‌బాల్ వాతావరణాన్ని మరింత పటిష్టం చేస్తాయని భావిస్తున్నారు. ఈ కీలక ప్రకటన ద్వారా తెలంగాణను క్రీడలకు ముఖ్య కేంద్రంగా మార్చడంతో పాటు, క్రీడల ద్వారా ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు కూడా ఈ సమ్మిట్ దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# గ్రామాల్లో మారుతున్న లెక్కలు

**మొదటి పేజీ తరువాయి**

అభ్యర్థిని ఎంపిక చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నుండి టిక్కెట్ ఖరారు చేసే ప్రయత్నంలో ఉంది. కానీ పార్టీ కోసం కష్టపడ్డ వారికి టికెట్ అనే సీఎం మాటలే గ్రామాలలో చర్చ నీయంశంగా మారాయి.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన సాధ్యం కాకపోవడంతో పాత విధానానికే తిరిగింది. దీంతో పలు గ్రామాలలో రిజర్వేషన్లు తారు మారయ్యాయి. సామాజిక కార్యక్రమాల పేరుతో ఇప్పటికే లక్షలు ఖర్చు చేసిన రిజర్వేషన్ మారకపోవడంతో ఆశావహులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ ఏమవుతుందో అన్న ఉత్కంఠ నెలల పాటు కొనసాగి. చివరకు

మారిపోవడంతో చాలామంది తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది.సర్పంచ్ ఓటర్ డ్రాఫ్ట్ సిద్ధం కావడంతో గ్రామాలలో ఎన్నికల చర్చలు భగ్గుమంటున్నాయి. ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగిన ఆశావహుల హాజరు తప్పనిసరి.

మాట్లాడితే గ్రామాభివృద్ధి, చేతులు కలిపితే మేమున్నాము అన్న సందేశం ఇదే ప్రస్తుతం స్థానిక రాజకీయాల దృశ్యం. ఎవరి బలంఎంత? అనుచరులు ఎంత? గ్రామంలో మద్దతు ఎలా? అన్నదానిపై రోజంతా లెక్కలు వేసుకుంటున్నారుదీర్ఘకాలంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, ఇటీవల అధికార పార్టీలో చేరి శ్రమించిన నాయకులు ఇలా ఈ రెండు వర్గాల మధ్య పోటీ మండలంలో చెలరేగుతుంది. లోకల్ నాయకుల సపోర్ట్ కోసం ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ ఆశావహులు నిత్యం క్యాంప్ చేస్తున్నారు.




ఎమ్మెల్యే ఆశీస్సులు ఉంటే గెలుపు ఖాయం అన్న నమ్మకంతో ప్రతి అభ్యర్థి అండ కోసం పరుగులు పెడుతున్నారుఅధికారంలో లేకపోయినాబి ఆర్ ఎస్ పంచాయతీ ఎన్నికల యుద్ధరంగంలోకి దిగింది. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వయంగా గ్రామాలలో పర్యటిస్తూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అధికార పార్టీ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అసంతృప్తి నెలకొనడంతో కొందరు కార్యకర్తలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని చర్చ జరుగుతున్నది. ఈ పరిస్థితిని ప్రతిపక్షం క్యాచ్ చేసుకునే అవకాశం కనిపిస్తుంది.ఎమ్మెల్యే ప్రయారిటీ, రిజర్వేషన్ గందరగోళం,ఆశావహుల హడావుడి, గ్రామాలలో రోజురోజుకు పెరుగుతున్న రాజకీయ వేడి, ఇవన్నీ కలగలిపి పంచాయతీ ఎన్నికలు మండలంలో హోరాహోరీగా సాగను న్నాయని సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీల మధ్య కాదు.. పార్టీ లోపల కూడా నువ్వా.. నేనా? అన్న టఫ్ ఫైట్ తప్పదని రాజకీయ వర్గాల అంచనా వేస్తున్నారు.

# గాంధీభవన్ లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం

**దశ, హైద్రాబాద్ / యాదగిరిగుట్ట :** టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన మంగళవారం గాంధీభవన్లో టీపీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్ ,సచిన్ సావంత్ ,మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకాటి శ్రీహరి, అజారుద్దీన్, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నూతన డీసీసీ అధ్యక్షులు,పూర్వ డీసీసీ అధ్యక్షులు,టీపీసీసీ కార్యవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల లో అనుసరించాల్సిన వ్యూహం , గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం, రెండేళ్ల ప్రజా పాలన వారోత్సవాల విజయవంతం తదితర అంశాలపై నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, నూతన డీసీసీ అధ్యక్షులు,పూర్వ డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..



# గాలికి వంట గ్యాస్ డెలివరీ నిబంధనలు

**దశ, భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో వంట గ్యాస్ డెలివరీ చేసే విషయంలో గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలు, ప్రభుత్వ ఆదేశాలను ఏమాత్రం పట్టించు కోవడం లేదు. ఇష్టా రీతిన, నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పౌర సరఫరాల శాఖ మరియు పెట్రోలియం ఎక్స్ ప్లోజీవ్ సేఫ్టీ ఆర్గనైజేషన్... పెసో మార్గదర్శకాల ప్రకారం..... పెసో ఆమోదం పొందినవి తప్ప వేరే వాహనం వాడకూడదు. వాహనంలో హైలీ ఇన్ ఫ్లెమబుల్ ఎల్పిజీ, నో స్మోకింగ్ అనే బోర్డు ఉండాలి. గ్యాస్ లీకేజి పరీక్ష కోసం సబ్బు ద్రావకం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఉండాలి. వాహనంలో సిలిండర్ నిలువుగా మాత్రమే ఉంచాలి. వాహనంలో పొగ తాగడం, మొబైల్ వాడకం చేయరాదు. వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ లో ఫర్ /ఎల్పిజీ సిలిండర్ డెలివరీ అని ఉండాలి. ఇక డెలివరీ సిబ్బంది విషయానికి వస్తే... యూనిఫామ్, ఐడి కార్డు తప్పనిసరిగా ధరించాలి. వీరికి ఫైర్ మరియు సేఫ్టీ విషయంలో పూర్తి శిక్షణ పొంది ఉండాలి. బైక్ డెలివరీ అయితే హెల్మెట్, షూ తప్పనిసరి. గ్యాస్ బాయ్ సిలిండర్ కనెక్ట్ చేయరాదు. వినియోగదారుడే బిగించుకోవాలి. సరైన సిలిండర్ బరువు సాధారణంగా 29.5 కిలోల బరువు ఉండాలి. సీళ్ళు, హాలోగ్రామ్ సరిగ్గా ఉండాలి. వాటిలో లీకేజి ఉంటే 1906 హెల్ప్ లైన్ నంబరుకు కాల్ చేయాలి.



## దేశానికే తలమానికం
# ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

**మొదటి పేజీ తరువాయి**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికే తలమానికం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అని పేర్కొన్నారు. యూనివర్సిటీని పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కావలసిన నిధులు ఇస్తానని స్పష్టం చేశారు. యూనివర్సిటీ వల్ల అనేక కొత్త కోర్సులు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యంగా భూమిలో ఉన్న కనిజ సంపదతో పాటు ఇతర సంపదపై పరిశోధన చేసే విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ పనిచేస్తుందన్నారు. భూగర్భంలో ఉన్న నిక్షేపాలను కూడా కనుగొనవచ్చు అని వివరించారు. విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. వ్యవసాయం కావాల్సిన ప్రాజెక్టులను కూడా సకాలంలో పూర్తి చేస్తామని సీఎం చెప్పారు. కెసిఆర్ హయాంలో అనేక ప్రాజెక్టులు నీరుగారిపోయాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను సేకరించి వాటిని పూర్తి చేసేందుకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..

ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకు వెళ్తామని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క అన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ భూమి పూజ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ త్వరితగతిన యూనివర్సిటీని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టిన యూనివర్సిటీని ఆయన స్థాయిలోనే ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తామని అన్నారు. ఈరోజు భూమి పూజ చేసుకున్న దేశంలోనే అత్యున్నత యూనివర్సిటీని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బిల్డింగులు, సకల సౌకర్యాలు పూర్తి చేస్తాం అందుబాటులోకి తీసుకువస్తాం అని డిప్యూటీ సీఎం తెలిపారు. హెల్త్ సైన్స్ యూనివర్సిటీ రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఓ పెద్ద కార్యక్రమం అని అన్నారు. పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఈ దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేదని అన్నారు. ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ద్వారా భూమి, భూమిలోపల ఉన్న పొరలు, భూమి లోపల ఉన్న ఖనిజాలు, భూమి చుట్టూ ఉన్న అనేక అంశాల పైన పరిశోధనలు చేయడమే కాకుండా తద్వారా ఈ దేశానికి ప్రపంచానికి విజ్ఞానాన్ని అందించే అద్భుత కార్యక్రమానికి, అత్యున్నత యూనివర్సిటీకి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూమి పూజ చేసి పనులు మొదలుపెట్టామని తెలిపారు. యూనివర్సిటీ దేశానికి తలమానికం, అత్యున్నత యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా ఈ దేశానికి తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

### యూనివర్సిటీకి మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం సంతోషంగా ఉంది: మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగా ఏర్పాటైన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం తనకు ఎంతో సంతోషంగా ఉందని తన హయాంలో యూనివర్సిటీ అభివృద్ధి జరగడం మరింత ఆనందంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. భద్రాద్రి జిల్లాకు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన వెంటనే స్పందించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు నిధులు కూడా ఇస్తారని చెప్పడం గొప్ప విషయం అన్నారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ అన్ని వర్గాల విద్యార్థులకు ఎంతో వరమని పేర్కొన్నారు. యూనివర్సిటీ ద్వారా విద్యార్థులు శాస్త్రవేత్తలుగా కూడా తయారు కావచ్చు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. భద్రాద్రి జిల్లాకు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ మంజూరు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకటి శ్రీహరి, రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

## కర్ల రాజేష్ చావుకు కారకులైన
# పోలీసులపై చర్యలు తీసుకోవాలి



❖ ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు మాదిగ

**దశ, నడిగూడెం:** నడిగూడెం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, జిల్లా ఎంఎస్ఎఫ్ కన్వీనర్ పందిటి నవీన్ ఆధ్వర్యంలో మండల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు చింత వినయ్ బాబు మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..... జిల్లాలోని కోదాడ పట్టణంలోని గాంధీనగర్ కు దళిత మాదిగ కులానికి చెందిన కర్ల రాజేష్ ను సిఎంఆర్ఎఫ్ నిధుల కేసు విషయంలో గత నెల 4వ తేదీన అక్రమంగా అకారణంగా పోలీసులు అరెస్ట్ చేసి కర్ల రాజేష్ ని ఇల్లీగల్ కస్టడీ లోకి తీసుకొని గత నెల నాలుగు తారీకు నుండి ఎనిమిదో తారీకు వరకు పోలీస్ లు చిలుకూరు పోలీస్ స్టేషన్ కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్కుకు తిప్పుతూ హింసించి చిత్రహింసలు పెట్టి ఎనిమిదో తారీఖున కర్ల రాజేష్ పైన దరఖాస్తు తీసుకొని ఆ కేసులో ఏ ఫోర్ గా ఉండబడినటువంటి కర్ల రాజేష్ను చిత్రహింసలు పెట్టి చిలుకూరు ఎస్సై పోలీసులు కోదాడ రూరల్ సిఐ పోలీసులు చిత్రహింసలు పెట్టి మనోవేదన గురి చేసి తన చావుకు కారణమైన పోలీసులును వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డినీ కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగంనీ వెంటనే సర్వీస్ నుండి రిమూవ్ చేయాలని ఎమ్మార్పీఎస్ తరపున డిమాండ్ చేసారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల డిసెంబర్ 10న చలో కోదాడను కర్ల రాజేష్ సంతాప సభను వేలాది మందితో ర్యాలీ జరపబోతున్నాం.

ఆ ర్యాలీ సభకు ముఖ్యఅతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఆ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రచార కార్యదర్శి మొలుగూరి రాజు మాదిగ, విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు నూక పంగు గురవయ్య, నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు దున్న వంశీ, వేణుగోపాలపురం గ్రామ శాఖ అధ్యక్షులు సంపతి లక్ష్మీనారాయణ, వీరబాబు, నామృత్, నిఖిల్, రోహిత్, సన్నీ, రాము, రాజు, సురేష్, వీరబాబు, పెద్దలు మాదిగ యువకులు పెద్ద ఎత్తున తదితరులు హాజరైనారు.

# బండ్లగూడ చెరువు సుందరీకరణ పనులు

❖ గుర్రపు డెక్క తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్



**దశ, ఎల్బీనగర్ :** నాగోల్ డివిజన్ లోని బండ్లగూడ చెరువు శుద్ధీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ మేరకు మంగళవారం చెరువులో వ్యర్థాల తొలిగింపు పనులను కార్పొరేటర్ చింతల అరుణా సురేందర్ యాదవ్ పరిశీలించారు. నాగోల్ డివిజన్ పరిధిలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ సంరక్షణ, చెరువుల పునరుజ్జీవనానికి చెరువు శుభ్రతతోపాటు గుర్రపు డెక్క తొలిగింపుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. చెరువులో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలు, నీటి నాణ్యత, నీటి మట్టం మరియు చెరువు లోపల పెరిగిన గుర్రపు డెక్కల వల్ల దోమల పెరుగుదల, ఆంటీ లార్వా సమస్యలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్, చెత్త పూర్తిగా తొలగించి చెరువును పునరుద్ధరించాలన్నారు. చెరువు చుట్టుపక్కల తుమ్మ మొక్కలు, జుల్లమొగ్గలు, దోమల పెరుగుదలకు కారణమయ్యే పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించాలి సూచించారు. చెరువు పరిసరాల్లో ఫాగింగ్ డ్రైవ్ ను ప్రతిరోజూ నిర్వహించాలని ఆదేశించారు. చెరువు వద్ద పర్యావరణ పరిరక్షణ కోసం క్యాంపోస్టింగ్ యూనిట్, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, గ్రీన్ కవర్ పెంపు, లైటింగ్ సౌకర్యాలు వంటి పౌర వసతులను దశలవారీగా కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జనార్ధన్, జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఈనెల 7న జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు

❖ మీడియా సమావేశంలో ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి యాదవ్ పిలుపు



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** ఐఎంఏ ట్రస్ట్, ఐఎంఏ సంయుక్తంగా ఈనెల 7వ తేదీన జిల్లా కేంద్రంలోని విద్యానగర్ లో వినూత్న సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ యందు నిర్వహించే ఉచిత న్యూరో, గ్యాస్ట్రో స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని అనేక రుగ్మతలతో బాధపడుతున్న పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వినూత్న హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో 30 ఏళ్లలో 300కు పైగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని అదే తరహాలో ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడేలా నిర్వహించే ఈ శిబిరానికి ఈనెల 5, 6 తేదీలలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మలబద్ధకం, నరాల బలహీనత, రక్తహీనత, కామెర్లు, ఉదరకోశం, వివిధ వ్యాధులతో బాధపడే వారికి వేల రూపాయల ఖర్చు అయ్యే వివిధ రకాల స్కానింగ్ లు ఉచితంగా చేయబడునని తెలిపారు. త్వరలో క్యాన్సర్ రాకుండా ఉండేందుకు క్యాన్సర్ డిటెక్షన్ క్యాంప్ ను కూడా 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు గర్భకోశ వ్యాధులు రాకుండా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ దాంఢ్గే, కార్యదర్శి డాక్టర్ రమేష్ నాయక్, ఐఎంఏ ట్రస్టు కార్యదర్శి డాక్టర్ రామకృష్ణ, వినూత్న హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రిజ్వాన్ మహమ్మద్, డాక్టర్ వి.ఉదయ్, హాస్పిటల్ మేనేజ్మెంట్ మధుకర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ద్వారకుంట గ్రామంలో టిడిపి, బిఆర్ఎస్ కలిసి పోటీ

❖ పిఏసిఎస్ మాజీ చైర్మన్ ముత్తవరపు రమేష్



**దశ, కోదాడ :** కోదాడ మండల పరిధిలోని ద్వారకుంట గ్రామంలో టిడిపి, బిఆర్ఎస్ కలిసి స్థానిక ఎన్నికల బరిలో ఉన్నట్లు పిఏసిఎస్ మాజీ చైర్మన్ ముత్తవరపు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపిలో 50 కుటుంబాలు చేరినట్లు వచ్చిన పలు పత్రికల్లో ఆ వార్తలను పూర్తిగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వారు మంగళవారం మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్, టిడిపి ఇరువురి వర్గాలు కలిసి పోటీ చేయుటకు నిర్ణయించుకున్నట్లు వారు అన్నారు. బిఆర్ఎస్ నుండి టిడిపిలో చేరిన చౌడం వెంకట్రామయ్యను సర్పంచ్ అభ్యర్థిగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఏడు వార్డులలో టిఆర్ఎస్, ఐదు వార్డులలో టిడిపి, పోటీ చేస్తున్నట్లు, ఉపసర్పంచ్, ఎంపీటీసీ బిఆర్ఎస్ కు ఇచ్చే విధంగా టిడిపి నాయకుల సమక్షంలో మాట్లాడినట్లు ఏ ఒక్క కుటుంబం కూడా బిఆర్ఎస్ పార్టీని వీడి టిడిపి పార్టీలో చేరలేదనీ తెలిపారు.

# ఔటర్ రింగు రోడ్డు వరకు సిటీనే..

**మొదటి పేజీ తరువాయి**

దాదాపు సగం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధి ప్రస్తుతం 650 చదరపు కిలోమీటర్లు. విస్తరణ తర్వాత దాదాపు 2,735 చదరపు కిలోమీటర్ల వరకు ఉండనుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ వార్షిక బడ్జె ట్ 8 వేల కోట్లు దాటగా.. విస్తరణ తర్వాత రూ.15 వేల కోట్లు దాటే అవకాశాలున్నా యి. విలీనం జరిగితే ప్రభుత్వం ముందుకు వచ్చే అత్యంత క్లిష్టమైన సమస్య సిబ్బంది కొరత. ప్రస్తుతం 650 చ.కి.మీ పరిధిలో ఉన్న జీహెచ్ఎంసీనే సిబ్బంది కొరతతో అల్లాడుతోందిపారిశుధ్య కార్మికులు, దోమల నివారణ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం

ఉన్న సిబ్బందితోనే చెత్త సేకరణ, రోడ్ల నిర్వహణ కష్టంగా ఉంది. ఇప్పుడు అదనంగా 1400 చ.కి. మీ విస్తీర్ణం వచ్చి చేరితే.. ఈ సమస్యలను ఎలా పర్యవేక్షిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కొత్తగా వేలసంఖ్యలో ఉద్యోగులను నియమించే ఆర్థిక స్తోమత ప్రభుత్వానికి ఉందా అన్నది ప్రశ్నార్థకమే. సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించినా, వారి జీతభత్యాలు తడిసి మోపెడవుతాయి. సిబ్బందిని పెంచకుండా విలీనం చేస్తే.. అటు నగరంలో నూ, ఇటు శివార్లలోనూ సేవలు పడకేసే ప్రమాదం ఉంది. శివారు ప్రాంతాల్లో ఇంకా చాలా చోట్ల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. సెప్టిక్ ట్యాంకులపైనే ఆధారపడుతున్నారు. జీహెచ్ఎంసీలో కలిపాక వాటన్నిం టికీ డ్రైనేజీ కనెక్షన్ ఇవ్వాలంటే వేల కోట్లు ఖర్చవుతుంది. అలాగే మంచినీటి సరఫరా కోసం జలమండలి తన నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించాలి. ప్రస్తుతం ఉన్న పైప్‌లైన్లు శివా రు కాలనీల దాహార్తిని తీర్చలేకపోతున్నాయి. ప్రభుత్వం ప్రస్తుతం పన్నులు పెంచబోమని చెబుతున్నప్పటికీ.. ఏకీకృత పాలన వ చ్చాక పన్నుల ఏకీకరణ తప్పనిసరి అవుతుం ది. ప్రస్తుతం చిన్న మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను తక్కువగా ఉంది. జీహెచ్ఎంసీలో విలీనమైతే.. నగరంతో సమానంగా కాకపోయి నా, ప్రస్తుతం ఉన్నదాని కంటే కచ్చితంగా పన్నులు పెరుగుతాయి. చెత్త సేకరణ ఛార్జీ లు, నీటి బిల్లులు, నాలా పన్ను వంటివి అదనపు భారం

కావచ్చు. ఇది మధ్యతరగతి ప్రజ లకు ఆందోళన కలిగించే అంశం. 2007లో అప్పటి ప్రభుత్వం 12 మున్సిపాలిటీలను కలిపి జీహెచ్ఎంసీని ఏర్పాటు చేసింది. అల్వాల్, ఉప్పల్, కాప్రా, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, రాజేంద్రనగర్ వంటి ప్రాంతాలు నగ రంలో కలిశాయి. విలీనమై 17 ఏళ్లు గడిచినా .. మల్కాజ్‌గిరి, ఉప్పల్, కాప్రా వంటి ప్రాం తాల్లో నేటికీ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. చిన్నపాటి వర్షానికే రోడ్లు మునిగిపోతున్నాయి. అంటే, కేవలం విలీనం చేసినంత మాత్రాన అభివృద్ధి జరగదని తేటతెల్లమైంది. సరైన ప్రణాళిక, సరిపడా నిధులు లేకుండా విలీనం చేస్తే.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పాత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, ఈసారి పక్కా ప్రణాళికతో వెళ్తేనే ఫలితం ఉంటుందని వారు చెబుతున్నారు. విలీన నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి మాత్రం పెద్ద వరంగా మారనుంది. జీహెచ్ఎంసీ లిమిట్స్ అనే ట్యాగ్ పడితే చాలు.. భూముల రేట్లు అమాంతం పెరుగుతాయి. పెద్దఎత్తున వెంచర్లు, హైరైజ్ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు వస్తాయి. బిల్డింగ్ పర్మిషన్లు సులభతరం అయితే ద్వారా నిర్మాణ రంగం ఊపందుకుంటుంది. రిజిస్ట్రేషన్లు, బిల్డింగ్ పర్మిషన్ల ద్వారా ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతుంది. అయితే, ఓఆర్ఆర్ లోపల ఇంకా వందలాది గ్రామాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. విలీనంతో ఈ ప్రాంతాల్లో పట్టణీకరణ వేగవంత మై.. గ్రామీణ సంస్కృతి, వ్యవసాయం పూ ర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురై కాంక్రీట్ జంగిల్స్‌గా మారే ముప్పు లేకపోలేదు. హై డ్రా వంటి సంస్థలు

ఉన్నా.. రియల్ మాఫియాను అడ్డుకోవడం సవాలే. జీహెచ్ఎంసీ విస్తరణ అనేది కాలగమనంలో జరగాల్సిన పరిణామమే. అంతర్జాతీ య నగరంగా ఎదగాలంటే ఇది అవసరం. కానీ, ఇది కేవలం సరిహద్దులు మార్చే

ప్రక్రియగా మిగిలిపోకూడదు. సామాన్యుడికి మెరుగైన జీవన ప్రమాణాలు, నాణ్యమైన రోడ్లు, స్వచ్ఛమైన నీరు, కాలుష్యరహిత వా తావరణం అందించినప్పుడే ఈ మెగా సిటీ కల సాకారం అవుతుంది. లేదంటే, సమస్య ల చదరంగంలో హైదరాబాద్ మరో క్లిష్టమైన పరిస్థితిలో బందీ అవుతుంది. బ్రాండ్ హైదరాబాద్ ఇమేజ్ పెంచే క్రమంలో.. బస్తీవాసుల బతుకులు చిత్రవధ కాకుండా చూ డాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. విలీనమవుతున్న 27 మున్సిపాలిటీల్లో ఆర్థికంగా భారీ వ్యత్యాసాలు ఉన్నాయి. ము న్సిపాలిటీలుగా మణికొండ, నార్సింగి, కొం పల్లి, బండ్లగూడ జాగీర్, తెల్లాపూర్ వంటివి రియల్ ఎస్టేట్ బూమ్‌తో కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అక్కడ మౌలిక వసతులు కొం త మెరుగ్గా ఉన్నాయి. పూర్ మున్సిపాలిటీలుగా జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగా రం, తుక్కుగూడ, జల్‌పల్లి వంటి మున్సిపాలిటీలు ఆదాయం లేక, కనీస రోడ్లు, డ్రైనేజీ లేక సతమతమవుతున్నాయిఅయితే ధనవంతులైన మున్సిపాలిటీల నుంచి వచ్చే మి గులు ఆదాయాన్ని, పేద మున్సిపాలిటీల అభివృద్ధికి మళ్లించే అవకాశం ఉంది. దీనివల్ల సమతూకం వస్తుందని ప్రభుత్వం భావి స్తోంది.

మణికొండ, నార్సింగి వాసులు తమ పన్నుల డబ్బు తమ ప్రాంత అభివృద్ధికి కా కుండా వేరే చోటికి మళ్లిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. ఇది భవిష్యత్తులో స్థానికంగా అసంతృప్తికి దారితీయవచ్చు. భవిష్యత్ పరిపాలన ఎలా ఉండాలి?.. విలీనం విజయవంతం కావాలంటే ప్రభు త్వం ఈ కింది చర్యలు తప్పక తీసుకోవాలని పట్టణ ప్రణాళిక నిపుణులు సూచిస్తున్నా రు. మొత్తం నగరాన్ని ఒకే కమిషనర్ పాలించడం అసాధ్యం.

ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 10 నుంచి 12 జోన్లకు పెంచాలి. జోనల్ కమిషనర్లకు పూర్తి ఆర్థిక, పరిపాలన అధికారాలు ఇవ్వాలి. చిన్న చిన్న సమస్యలకు హెడ్ ఆఫీస్ చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. విలీన ప్రాంతాల

అభివృద్ధికి వచ్చే ఐదేళ్ల పాటు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. కేవలం అక్కడి పన్నుల ఆదాయంపైనే ఆధారపడకుండా.. ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో నిధులు ఇవ్వాలి. యుద్ధ ప్రాతిపదికన ఖాళీలను భర్తీ చేయాలి. ప్రతి 500 ఇళ్లకు ఒక పారిశుధ్య కార్మికుడు ఉండేలా చూడాలి. ఓఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రోత్ కారిడార్లలో ప్రజా రవాణాను మెట్రో, బస్సులు విస్తరించాలి. లేదంటే ట్రాఫిక్ సమస్యలు నరకప్రాయంగా మారుతాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ భారీ నిర్ణయం వెనుక ప్రధానంగా మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. సమగ్ర అభివృద్ధి ప్రస్తుతం కోర్ సిటీ పాత ఎంసీహెచ్ ఒకలా, విలీన ప్రాంతాలు మరోలా, శివారు మున్సిపాలిటీలు ఇంకోలా అభివృద్ధి చెందుతున్నాయిఒక రోడ్డు వేయాలన్నా, డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలన్నా.. ఒక మున్సిపాలిటీ దాటగానే మరో మున్సిపాలిటీ అనుమతులు, నిధుల కొరత అడ్డంకిగా మారుతోంది. ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని ఒకే పాలనా గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా మాస్టర్ ప్లాన్‌ను ఏకతాటిపై అమలు చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌ను మెగా సిటీగా ప్రాజెక్ట్ చేయాలంటే జనాభా, విస్తీర్ణం కీలకం 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, సుమారు 2 కోట్ల జనాభాతో కూడిన నగరం ఏర్పడితే.. ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ , జైకా వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి భారీ నిధులు, రుణాలు పొందడం సులభమవుతుంది. రాజకీయంగా చూస్తే.. శివారు ప్రాంతాల్లో ఉన్న వివిధ సమీకరణాలను ఒకే గొడుగు కిందకు తేవడం ద్వారా పాలనపై పట్టు సాధించవచ్చని, తద్వారా నియోజకవర్గాల పునర్విభజన లేదా వార్డుల పెంపు ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. విలీన నిర్ణయం వెలువడగానే అధికారులు తెర వెనుక భారీ కసరత్తు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గత కొన్ని రోజులుగా వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారు ప్రధానంగా దృష్టి పెట్టిన అంశాలు ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో 150 వార్డులు ఉన్నాయి.

జనాభా ప్రాతిపదికన చూస్తే.. కొన్ని వార్డుల్లో లక్షల్లో జనం ఉంటే, మరికొన్నింటిలో వేలల్లోనే ఉన్నారు. ఈ అసమానతలను తొలగించి, కొత్తగా వచ్చే 27 మున్సిపాలిటీలను కలుపుకుని వార్డుల సంఖ్యను 250కు పెంచాలని అధికారులు ప్రణాళిక రచిస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్కిల్ రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తరించి ఉంటోంది. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీన్ని సవరించి.. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు సర్కిళ్లు ఉండేలా డీలిమిటేషన్ చేస్తున్నారు. ఇప్పటికే కాప్రా, బేగంపేట్ సర్కిళ్లలో ఈ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 28 సర్కిళ్లలో పనులు జరుగుతున్నాయని సమాచారం.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..





## నూతన డిఎస్పి శ్రీనివాసరెడ్డికి ఘన సన్మానం

**దశ కోదాడ :** కోదాడ నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి గారిని కోదాడ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. డిఎస్పీ మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు కోసం 24గం, లు అందుబాటులోనే ఉంటానని. ఏదైనా ఆపద వస్తే, అవసరమైతే అర్ధరాత్రి కూడా ఫోన్ చేయవచ్చని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నవారు కోదాడ పట్టణం పద్మశాలి సంఘం అధ్యక్షుడు గొర్రె రాజేష్, తెలంగాణ రాష్ట్రం పద్మశాలి సంఘం కార్యదర్శి సంగిశెట్టి గోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడు కొంగరి నరసింహారావు, మాజీ పద్మశాలి సంఘం ప్రెసిడెంట్ గోలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి పిండిప్రోలు శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఆనంద్ వెంకట్రావు, కోశాధికారి పంతంగి నరేష్, సహాయ కార్యదర్శి చెరుకుపల్లి మట్టయ్య, కమిటీ సభ్యులు ఎలగందుల రాఘవయ్య, నక్క గోపి, బుద్ధవరపు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి ..తీవ్ర గాయలు



**దశ, హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ శివగంగ కాలనీలో ఏడేండ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. 10 నుంచి 15 వరకు కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి మెడ, చెవి, నడుము, పిక్కలను కొరకడంతోపాటు చెవి ఊడిపోయి.. బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతిరావు, చంద్రకళ దంపతులు మేస్త్రి పనులు చేసుకుంటూ శివగంగ కాలనీలో మూడేండ్లుగా ఉంటున్నారు. వీరి కొడుకు ప్రేమ్ చంద్ పుట్టుకతోనే మూగవాడు కావడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా తల్లి ఇంట్లో తాగునీరు పడుతోంది. ఆ సమయంలో ఇంట్లో నుంచి ఆడుకుంటూ బయటకు వచ్చిన ప్రేమ్ చంద్ పై వీధి కుక్కలు దాడి చేశాయగా, స్థానికులు గమనించి కుక్కల్ని తరిమేశారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని నిలోఫర్ చిల్డ్రన్స్ ఆస్పత్రికి తరలించారు.


## ఓయూలో విద్యార్థుల ఆందోళన



**దశ, ఓయూ:** ఓయూలోని హాస్టల్స్ మెస్లలో నాణ్యత లోపిస్తుందని పలుమార్లు విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నా సమస్య పరిష్కారం అవ్వడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మంగళవారం రాత్రి కుళ్లిపోయిన భోజనం పెట్టారని విద్యార్థులు ధర్నాకు దిగారు. లా హాస్టల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దీనిపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన భోజనం అందించే వరకు ఆందోళనలు ఆపేది లేదన్నారు.

## అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా


❖ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వరికల రమేష్



**దశ, మునగాల:** మునగాల మండలం రేపాల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వరికల రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని తెలిపారు. ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయితీగా తీర్చి దిద్దుతానని ఆయన అన్నారు. గ్రామ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా కృషి చేస్తానని, గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, నాగిరెడ్డి నర్సిరెడ్డి, రేపాల గ్రామం మాజీ ఎంపీటీసీ సోమపంగు మోహన్, మాజీ సర్పంచ్ బెజవాడ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ, గిరిజన భూములుకు 1/70 చట్టం ను కేంద్రం ప్రభుత్వం పట్టిష్టంగా అమలు చేయాలి: BCSF

**దశ, ఓయూ:** ఆదివాసీ, గిరిజన భూములకు కేంద్రం ప్రభుత్వం 1/70 యాక్ట్ ను పటిష్టం చేయాలని,రాజ్యాంగం హక్కులను కాలరాస్తున్న సందర్భంగా ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం ను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన భూములను 1/ 70 యాక్ట్ అమలు చేయడం లో జాప్యం చేస్తుంది అని వారు తెలిపారు. ఆదివాసీ, గిరిజనుల సంపదను కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు అప్పగించడం ప్రజాస్వామ్యం వ్యతిరేకం అని వారు తెలిపారు. కార్పొరేట్ వ్యవస్థలు అడవులు ను నరికివేసి పర్యావరణం ను పాడు చేస్తూ పర్యావరణ కాలుష్యం కి కారణం అవుతున్నారు అని వారు తెలిపారు. అడవి సంపదను కార్పొరేట్ వ్యవస్థ లకి ఇవ్వడం చాలా దారుణమైన చర్య అని వారు తెలిపారు. ఆదివాసీ,గిరిజనులు అడవి ప్రాంతం లోని అడవులను నరికి వేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ కు ముప్పు వాటిల్లుతుంది అని కేంద్రం వేంటనే కార్పొరేట్ వ్యవస్థ ల అడవులు నరికివేత ను నిలిపి వేయాలి అని వారు తెలిపారు. 1/70 చట్టం ను ఉల్లంఘించి భూములు ను ప్రైవేట్, వ్యక్తులు ఇవ్వడం చట్ట విరుద్ధంగా నేరం అని వారు తెలిపారు. ఆదివాసీ, గిరిజన భూముల పై వారికే హక్కు ఉండే విదంగా కేంద్రం ప్రభుత్వం చట్టాలు తీసుకురావాలని వారు తెలిపారు. ఆదివాసీ, గిరిజనులపై జరిగే దోపిడీ, అత్యాచారాలు ను కేంద్రం ప్రభుత్వం వెంటనే అరికట్టాలి అని వారు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన ప్రజలను దృష్టిలో ఉంచుకొని అడవులు నరికివేత, అడవి సంపదను కాపాడాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో విద్యార్థి నాయకులు పాలడుగు శ్రీను, ఆజాద్, అసిఫ్, నవీన్, కరణ్ లింగయ్య, శ్రీధర్ యాదవ్, శ్రవణ్, లక్ష్మణ్, కోలా శేఖర్,అచ్యుత్, ప్రసన్న, సుభాష్, వినయ్, భరత్, మనోజ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.






## హయత్ నగర్ ఆర్టీసీ డిపో ఎదుట ఆందోళన

❖ బస్సు ప్రమాదంలో చెయ్యి కొల్పోయిన
❖ బాధితుడి కుటుంబ సభ్యుల ఆందోళన

**దశ, ఎల్బీనగర్ :** ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన రోడ్డు ప్రమాదంలో చెయ్యి కొల్పోయిన బాధితుడికి పరిహారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు, బంధువులు మంగళవారం హయత్ నగర్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే... గత 27వ తేదీన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పిస్తా హౌస్ వద్ద సర్వీస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటన చోటు చేసుకుంది.. ఈ ప్రమాదంలో హయత్ నగర్ డివిజన్ కు చెందిన సాయికృష్ణ కుడి చెయ్యిని పోగొట్టుకున్నాడు. సాయికృష్ణ(19) న్యాయం చేయాలని, తగిన పరిహారం చెల్లించాలని బాధితుడి బంధువులు న్యాయం చేయాలని ధర్నా నిర్వహించారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే కుడిచేయి తీయాల్సి వచ్చిందని తెలిపారు. డిపో మేనేజర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## బీసీ రిజర్వేషన్లు పెంచాలని గాంధీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బత్తుల సిద్దేశ్వరుకు సంఘీభావం

❖ ప్రకటించిన బీసీ జేఏసీ, ఓయు జేఏసీ నేతలు

**దశ, ఓయూ :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గాంధీ ఆసుపత్రిలో ఐదవ రోజు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వరుని మంగళవారం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను దగా చేశాయని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా ప్రకటించి ఈరోజు ఎలాంటి రిజర్వేషన్ లేకుండానే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం చాలా బాధాకరమని అన్నారు. చివరి వరకు బీసీలను ఆశపెట్టి ఆశల పల్లకిలో మోస్తూ ఒకటేసారి బీసీల ఆశల మీద నీళ్లు చల్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కనాడు అయినా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు పార్లమెంట్లో ఈ అంశాన్ని లేవనెత్తలేదని, ఓటు చోరీ అని తిరుగుతున్న రాహుల్ గాంధీ బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్లమెంట్లో బిజెపి ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదన్నారు. కార్యక్రమంలో ఓయూ జెఎసి చైర్మన్ పొన్నం ముత్యం గౌడ్,బీసీ విద్యార్థి ఓయు ఇంచార్జ్ గోదా రవీందర్, టిజిఆర్ఎస్ఏ చైర్మన్ దూడపాక సురేష్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పోలంపల్లి కుటుంబరావు





**దశ, కోదాడ:** కోదాడ మండల పరిధిలోని రెడ్లకుంట గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోలంపల్లి కుటుంబరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రెడ్లకుంట గ్రామం నుంచి పెద్ద ఎత్తున ఊరేగింపుగా బయలుదేరి కాపుగల్లు గ్రామపంచాయతీ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను సమర్పించి ఆయన మాట్లాడారు. తనను బలపరిచిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంగవరపు లక్ష్మణరావు, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రసాదరావు, మాజీ సర్పంచ్‌లు మరియమ్మ, నెట్టెం జగన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో గంగవరపు లక్ష్మణరావు తన సొంత స్థలాన్ని నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీకి అందించారని తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి కృషి చేశారనీ తెలిపారు. గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

గ్రామంలో నెలకొన్న తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతర ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. నామినేషన్ దాఖలు సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ అభ్యర్థికి సంఘీభావం తెలిపారు. గ్రామంలో రాజకీయ ఉత్సాహం నెలకొనడంతో రెడ్లకుంటలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థికి మద్దతు ప్రకటించారు.

# గాజులపల్లి గ్రామ, ప్రజల సేవలే లక్ష్యంగా ముందుకు సాగిన పంజ స్వామి

❖ బాల్యం నుంచే రాజకీయంపై ఆసక్తి
❖ దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్ తో సన్నిహిత సంబంధాలు




**దౌల్తాబాద్, దశ:** ఎంత పెద్ద ప్రయాణమైనా మొదలయ్యేది ఒక్క అడుగుతోనే, ఒక్కో మెట్టు ఎక్కుతూ, అన్ని రకాల రాజకీయ ఎత్తుగడలను తిప్పికొడుతూ, తనదైన మార్క్ రాజకీయాలతో నేడు గాజులపల్లి గ్రామంలో తనే ప్రధాన పోటీదారుగా, ముందు వరుసలో ఉన్నాడు.అతను ఎవరో కాదు. పంజ స్వామి.

### బాల్యం నుంచే,రాజకీయ అరంగేట్రం..

పంజ స్వామి, గాజులపల్లి గ్రామంలో ఈ పేరు తెలియని వారు ఎవరు ఉండరేమో అలాగే దౌల్తాబాద్ మండలంలో చాలామందికి సుపరిచితం. ఫారుక్ హుస్సేన్, దివంగత నేత మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి గార్లకు సన్నిహితుడిగా పేరు పొందాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో గాజులపల్లి గ్రామ టీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడిగా, కీలక పాత్ర పోషించాడు. 2013లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిని గెలిపించడంలో కీలక పాత్ర పోషించాడు.అలాగే అభివృద్ధి కార్యక్రమాల్లో సైతం తనవంతు పాత్ర పోషించాడు.

### రైతన్నల అభివృద్ధికి కృషి..

నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటు, వారి అభివృద్ధికై నూతన వరి వంగడాలను రైతులకు పరిచయం చేసిన మొట్టమొదట వ్యక్తి పంజ స్వామి, తనకున్న పరిచయాలతో పయనీర్ కంపెనీతో ఒప్పందం చేసుకొని రైతులకు వరి విత్తనాలను మరియు వాటికి సంబంధించిన మందులను అందుబాటు ఉంచడంలో పంజ స్వామి కృషి ఎనలేనిది.

### యువతతో, సాన్నిహిత్యం క్రీడా పోటీలు నిర్వహణ

గాజులపల్లి యువత మిగతా గ్రామాల కంటే భిన్నంగా ఆలోచిస్తూ అన్ని రంగాలలో ముందుకు వెళుతుంది. అలాంటి యువకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి ఆశయాలకు అనుగుణంగా, వారితో అభిప్రాయాలను పంచుకుంటూ మంచి సత్సంబందాలు ఎర్పరుచుకున్న వ్యక్తి పంజ స్వామి, ముఖ్యంగా ప్రతి సంవత్సరం గ్రామ యువతకు క్రికెట్ క్రీడలు నిర్వహించి బహుమతులు అందజేసి కీలక పాత్ర పోషించాడు. మాజీ ఎమ్మెల్సీ ఫారక్ హుస్సేన్ తీసుకువచ్చి ఆయన చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం చేయించడం ఎన్నటికి మరువలేనిది.



### ఆపదలో వందల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత..

దౌల్తాబాద్ మండలంలోనే అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రిలీజ్ చేయించి, పంజ స్వామి రికార్డ్ సృషించారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ కు సంబంధించిన చెక్కులు అందించే ప్రయత్నం చేశారు. ఆపదలో ఉన్న చాలా మంది పేదలకు ఇదొక వరంగా మారింది.

### గ్రామ ప్రజా ప్రతినిధిగా, అవకాశం ఇస్తే అభివృద్ధికి కృషి చేస్తా..

అధికారంలో లేకపోయినా, అధికారులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ,వీధి దీపాల ఏర్పాట్లలో కానీ,మురికి కాలువలు శుభ్రం చేయించడంలో కాని తనదైన పాత్ర పోషించారు. ఇలాంటి వ్యక్తులు అధికారంలో ఉంటే నిజమైన పేదలకు ప్రభుత్వ ఫలాలు అందుతాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. సీసీ రోడ్లు, మురికి కాలువలు, ఎండాకాలంలో త్రాగు, సాగు నీటి సమస్యలు, గతంలో అధికారులు చేసిన తప్పుదాల వల్ల ఎర్పడిన భూ సమస్యలు పరిష్కారం దిశగా తనవంతు ప్రయత్నం చేస్తానని, ఎల్లప్పుడు ఆపద, సంపద సమయంలో కుల, మత, వర్గ బేదాలు లేకుండా అందరి అభివృద్ధికై అందుబాటులో ఉంటానని, ఈసారి సర్పంచిగా గ్రామ ప్రజలందరూ ఆశీర్వదించి అభివృద్ధికి ఓటు వేయాలని గాజులపల్లి గ్రామ ప్రజలను, పెద్దలను, మహిళలను, యువతను తమకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నాడు.